
దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్డీవో జయదేవ్ ఆర్య


ప్రజావాణికి 46 అర్జీలు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: సిద్దిపేట కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 46 దరఖాస్తులు వచ్చాయి. స్వీకరించిన కలెక్టర్ మనుచౌదరి ఆయా శాఖలకు బదిలీ చేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డీఆర్డీవో జయదేవ్ ఆర్య, డీఆర్వో నాగ రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

● పోరంబోకు స్థలంలో పాకలు వేసుకున్న తమను అక్కడే ఉండనివ్వాలని చేర్యాల మండలం వీరన్నపేట గొర్రెల పెంపకందారులు విన్నవించారు.

● బీసీ కులగణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రోళ్ల రవిబాబు అర్జీ సమర్పించారు.

● తమ గ్రామంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ నారాయణరావుపేట మండల కేంద్రానికి చెందిన రైతులు కోరారు.


పరిహారం కోసం రోదిస్తున్న 'మల్లన్నసాగర్' నిర్వాసితురాలు

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

చేర్యాల, న్యూస్‌టుడే: చేర్యాల మండలం ముస్త్యాల 132/కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్తు సరఫరా ఉండదని ఆ శాఖ చేర్యాల డివిజన్ ఏడీఈ రత్నాచారి ఒక ప్రకటనలో తెలిపారు. చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి, ధూల్మిట్ట మండలాల్లోని అన్ని గ్రామాల్లో ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు త్రీఫేజ్ విద్యుత్తు సరఫరా నిలిపివేసి, సింగిల్ ఫేజ్ అందిస్తామన్నారు. రైతులు, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

డీఎస్సీలో మొదటి ర్యాంకు



దుగ్గొండి, న్యూస్‌టుడే: వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన ఎండీ ఫర్జానా డీఎస్సీ స్కూల్ అసిస్టెంట్ హిందీ విభాగంలో 65.67 మార్కులు పొందడంతో సిద్దిపేట జిల్లాలో ప్రథమ ర్యాంకు సాధించారు. ఈమెది సిద్దిపేట జిల్లా. వివాహం కావడంతో అత్తగారి గ్రామమైన వెంకటాపురంలో ఉంటున్నారు. ఫర్జానాను గ్రామస్థులు అభినందించారు.

దసరా లోపు నామినేటెడ్ పోస్టుల భర్తీ

మెదక్, న్యూస్‌టుడే: ఉమ్మడి మెదక్ జిల్లాలో నామినేటెడ్ పోస్టుల భర్తీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంగీకారం తెలిపారని ఉమ్మడి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండా సురేఖ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఆమె, మంత్రి దామోదర్ రాజనర్సింహతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా వారు ఉమ్మడి మెదక్ జిల్లాలో నామినేటెడ్ పోస్టుల భర్తీ విషయమై చర్చించారు. పలు సమీకరణాలపై చర్చ అనంతరం ముఖ్యమంత్రి స్పష్టతనిచ్చారని మంత్రి సురేఖ పేర్కొన్నారు. దసరా లోపు పోస్టులను భర్తీ చేయనున్నట్లు సీఎం వివరించారన్నారు.



విలీనం లేనట్లే!

హుస్నాబాద్ మున్సిపాలిటీ విస్తరణకు గ్రామాల విముఖత

న్యూస్‌టుడే, హుస్నాబాద్: పట్టణంలో కలిసేందుకు కొన్ని గ్రామాలు ఇష్టపడటం లేదు. హుస్నాబాద్ పురపాలక సంఘం పరిధిని విస్తరించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రయత్నిస్తుండగా గ్రామాల వారు ససేమిరా అంటున్నారు. పరిసరాల్లోని గ్రామాలను విలీనం చేసే ప్రతిపాదన ఏదీ లేదని తెలుస్తోంది. ప్రస్తుత పురపాలక పాలకవర్గం వచ్చే జనవరితో గడువు ముగియనుంది. మళ్లీ కొత్త పాలకవర్గం ఏర్పాటుకు ప్రభుత్వం ఎన్నికలు నిర్వహిస్తుంది. ఈ క్రమంలో పురపాలికల పరిసరాల్లో ఉన్న గ్రామాలను విలీన ప్రక్రియ జరుగుతూ ఉంటుంది. రెండేళ్ల క్రితం హుస్నాబాద్ పురపాలికలో పోతారం(ఎస్), గాంధీనగర్, నాగారం, పందిల్ల, చిగురుమామిడి మండలంలోని కొండాపూర్ తదితర గ్రామాలను విలీనం చేయాలనే ప్రతిపాదన ఉండేది. అప్పటి శాసనసభ్యుడు సతీశ్‌కుమార్ పలు సమావేశాల్లో వెల్లడించారు. రానున్న పురపాలిక ఎన్నికల సమయంలో ఈ గ్రామాలను విలీనం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతాయని భావించారు. హనుమకొండ రోడ్ వైపున హుస్నాబాద్ పట్టణానికి కలిసినట్లుగా పోతారం (ఎస్) గ్రామం.. జనగామ దారిలో గాంధీనగర్ ఉన్నాయి. గాంధీనగర్ పరిసరాల్లోనే సమీకృత కార్యాలయాల భవనం నిర్మించి ప్రారంభించారు. ఇక్కడి వరకు పురపాలిక సరిహద్దు ఉందని చెబుతున్నారు.

హుస్నాబాద్ పురపాలిక	
జనాభా	32,000
ఓటర్లు	18,730
వార్డులు	20

మంత్రి లేఖ రెండు గ్రామాల్లోని ప్రజలు మాత్రం పురపాలికలో విలీనం చేయవద్దని కోరుతున్నారు. పురపాలికలో చేర్చడం వల్ల పన్నులు పెరుగుతాయని, ఉపాధి హామీ పథకం అమలు కాదని చెబుతున్నారు. వ్యవసాయానికి సంబంధించి కొన్ని పథకాల అమలుకు అవకాశం లేకుండా పోతోందంటున్నారు. గ్రామాల ప్రజలు విలీనం పట్ల ఆసక్తి చూపడం లేదు. ఇప్పటికే హుస్నాబాద్ పట్టణం రోజురోజుకు అభివృద్ధి చెందుతూ విస్తరిస్తోంది. ఓటర్ల సంఖ్య జాబితా తుది దశకు వచ్చేసరికి 20 వేలకు చేరవచ్చని అంచనా. పరిసర గ్రామాల నుంచి అనేక కుటుంబాలు ఇక్కడ నివాసాలు ఏర్పాటు చేసుకుంటున్నాయి. పెరుగుతున్న ఓటర్లతో ప్రస్తుతం ఉన్న 20వార్డులకు అదనంగా మరిన్ని పెరుగవచ్చని భావిస్తున్నారు. ఇటీవల కరీంనగర్ నగర పాలక సంస్థలో పరిసరాల్లో పలు గ్రామాలను విలీనం చేయాలంటూ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రభుత్వానికి లేఖ రాశారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న హుస్నాబాద్ విషయంలో ఆయా గ్రామాల ప్రజల అభిప్రాయం మేరకు విముఖంగా ఉన్నారు. గత ప్రభుత్వ హయాంలో పరిసర గ్రామాలను పురపాలికలో విలీనం కొరకు ప్రతిపాదన తయారు చేశారని, ఇపుడు అలాంటిదేమి లేదని పుర కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్ తెలిపారు.

'హైడ్రా పేరిట డ్రామాలు ఆపాలి'


ప్రమాద బీమా చెక్కు అందిస్తున్న హరీశ్‌రావు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: మూసీ సుందరీకరణ కోసం లక్షాయాభై వేల కోట్లు ఖర్చు చేస్తాననటం విడ్డూరంగా ఉందని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. హైడ్రా పేరిట చేస్తున్న డ్రామాలను సీఎం రేవంత్‌రెడ్డి ఇకనైనా ఆపాలని డిమాండ్ చేశారు. సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిల్లా ఆటో క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం ఆటోడ్రైవర్లకు ఏకరూప దుస్తులు అందజేశారు. కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడారు. ఆర్టీసీలో మహాలక్ష్మి పథకంతో రాష్ట్రంలో ఆటో కార్మికుల జీవితాలు దుర్భరంగా మారాయన్నారు. ఆత్మహత్యలు చేసుకున్న ఆటో కార్మికుల కుటుంబాలకు వెంటనే రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలన్నారు. కార్మికుల కోసం సిద్దిపేటలో తన సొంత ఇంటిని తనఖా పెట్టి రుణాలు ఇప్పించానని గుర్తు చేశారు. పెట్రోల్‌బంకు ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మృతిచెందిన ఇద్దరు డ్రైవర్ల కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల చొప్పున బీమా చెక్కులను అందజేశారు. సొసైటీ అధ్యక్షుడు పాల సాయిరాం, ప్రధాన కార్యదర్శి లక్ష్మారెడ్డి, ప్రతినిధులు పాల్గొన్నారు.

భారాస హయాంలో వెలువరించిన జీవో నం. 11, 12 ప్రకారం ఇటీవల ఉపాధ్యాయ, ఉద్యోగుల బదిలీలు జరిగాయని హరీశ్‌రావు తెలిపారు. ప్రభుత్వ ఫిజికల్ డైరెక్టర్ శుభాకర్‌రెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా సోమవారం సిద్దిపేటలో నిర్వహించిన కార్యక్రమంలో హాజరై మాట్లాడారు. మార్చిలో ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులకు ఇప్పటి వరకు సంబంధిత సొమ్ము, సదుపాయాలు దక్కలేదన్నారు. ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయుడు ఎస్.రాములును సత్కరించి అభినందించారు.

శాస్త్రసాంకేతిక రంగాల్లో అనేక అవకాశాలు


గజ్వేల్: విద్యార్థులతో మాట్లాడుతున్న రాజేంద్రసింగ్

సిద్దిపేట టౌన్: విద్యార్థులకు శాస్త్ర సాంకేతిక రంగాల్లో అనేక అవకాశాలు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కళాశాల విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ రాజేంద్ర సింగ్ అన్నారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గజ్వేల్ మహిళ డిగ్రీ కళాశాలల్లో ఆయన పర్యటించారు. అధ్యాపకులు, విద్యాబోధనలతో పాటు పరిశోధన రంగంలో కృషి చేయాలని సిద్దిపేటలో మార్గనిర్దేశనం చేశారు. విద్యార్థులు అన్ని పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని అందుకు సంబంధించిన స్టడీ మెటీరియల్‌ను గజ్వేల్ కళాశాల గ్రంథాలయంలో ఏర్పాటు చేస్తామని చెప్పారు. అవకాశాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థినులు చదువుల్లో ఉన్నతులుగా రాణించాలని ఆయన కోరారు. ఆయా కార్యక్రమాల్లో గజ్వేల్, సిద్దిపేట ప్రిన్సిపాళ్లు క్రిస్టియాన, సునీత, వైస్ ప్రిన్సిపాళ్లు శ్రీలత, అయోధ్యరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.7.56 లక్షలు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: సిద్దిపేట పట్టణంలోని మోహినిపురా వేంకటేశ్వరాలయ హుండీ ఆదాయం సోమవారం లెక్కించారు. ఈ సందర్భంగా 110 రోజుల ఆదాయం రూ. 7,56,373 సమకూరినట్లు ఈవో రవికుమార్ వెల్లడించారు. లెక్కింపులో వికాస తరంగిణి, కోటిలింగాల సేవాసమితి ప్రతినిధులు, ఆలయవర్గాలు, ఆలయ వ్యవస్థాపక అనువంశిక ధర్మకర్త, ఛైర్మన్ రమేశ్ విష్ణు పాల్గొన్నారు.

భారాస నాయకులపై ఠాణాలో ఫిర్యాదు

సిద్దిపేట టౌన్, దుబ్బాక, న్యూస్‌టుడే: జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండా సురేఖపై భారాస నాయకులు కొందరు సామాజిక మాధ్యమాల్లో అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూజల గోపీకృష్ణ, నాయకులు అన్నారు. వారు సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. మంత్రి, మహిళ అని చూడకుండా ఇష్టారాజ్యంగా పోస్టులు పెట్టడం సబబు కాదని.. సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారంపై కాంగ్రెస్ శ్రేణులు తగిన రీతిలో బుద్ధి చెబుతారని జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి మచ్చ శ్రీనివాస్ దుబ్బాకలో మాట్లాడుతూ హెచ్చరించారు. దుబ్బాక పట్టణంలోని బస్టాండ్ వద్ద కాంగ్రెస్ నాయకులు.. పద్మశాలి చేనేత కార్మికులతో కలిసి మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు చిత్రపటాలను దహనం చేశారు. ఇన్‌ఛార్జి మంత్రి హోదాలో కొండా సురేఖ దుబ్బాకకు వస్తే ప్రొటోకాల్ పేరుతో భారాస నాయకులు గొడవలు సృష్టిస్తున్నారన్నారు. సంఘం అధ్యక్షుడు జిందం గాలయ్య, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అన్ని శాఖల సమన్వయంతో ప్రయాణ భద్రత


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్, చిత్రంలో సీపీ, అధికారులు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రయాణాలు సాఫీగా సాగేలా అన్ని శాఖల సమన్వయంతో భద్రత చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. సిద్దిపేట సమీకృత కలెక్టర్ కార్యాలయంలో పోలీసు కమిషనర్ అనూరాధ, సంబంధిత శాఖల అధికారులతో కలిసి సోమవారం జిల్లాస్థాయి రోడ్డు భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి, వేగనిరోధకాలు ఏర్పాటు చేయాలన్నారు. మలుపుల వద్ద చెట్ల కొమ్మలను కత్తిరించాలన్నారు. గుంతలు మరమ్మతు చేయించాలని సూచించారు. రహదారుల నుంచి నిర్దేశిత దూరం పాటించి మద్యం దుకాణాలు పెట్టుకోవడానికి అనుమతినివ్వాలని ఆబ్కారీ అధికారులకు చెప్పారు. ఆర్టీసీ అద్దె బస్సుల డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. అనంతరం మాదక ద్రవ్యాల నియంత్రణపై సంబంధిత శాఖ అధికారులతో జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. అన్ని పాఠశాలల్లో కమిటీలు వేయాలన్నారు. జిల్లా జైలులో ఖైదీలకు కల్పిస్తున్న సౌకర్యాలు, న్యాయసహాయంపై ఆరా తీశారు. అదనపు డీసీపీ మల్లారెడ్డి, గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్, డీఎఫ్ఓ శ్రీనివాస్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసమూర్తి, ఏసీపీలు మధు, పురుషోత్తం, సతీష్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరిశ్రమలకు 805 ఎకరాలు కేటాయింపు

వర్గల్ ఇండస్ట్రియల్ పార్కు భూనిర్వాసితుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం సీపీ అనూరాధ, సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. 992 మంది రైతుల నుంచి పార్కు కోసం 805 ఎకరాల భూమిని టీజీఐఐసీకి అప్పగించామన్నారు. రైతులతో చేసుకున్న ఒప్పందం ప్రకారం వారికి నష్టపరిహారం అందించామన్నారు. దాంతో పాటు 481 ప్లాట్లను రైతులకు కేటాయించామన్నారు. రిజిస్ట్రేషన్ చేయాలని చెప్పారు. కమిషనరేట్ పరిధిలోని స్పెషల్ బ్రాంచ్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న మహ్మద్ అలీముద్దీన్, సీఏఆర్ హెడ్‌క్వార్టర్‌లో ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న మాచర్ల జనార్ధన్ ఉద్యోగ విరమణ పొందగా వీడ్కోలు సమావేశాన్ని సీపీ నిర్వహించారు.

బొడ్డెమ్మకు వీడ్కోలు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: సిద్దిపేట పట్టణంలో బొడ్డెమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. సోమవారం పలు కాలనీల్లో మహిళలు సంప్రదాయబద్ధంగా బొడ్డెమ్మ ఆడి కోమటిచెరువులో నిమజ్జనం చేశారు. సిద్దిపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బతుకమ్మలను చేసి ఆడిపాడారు.



స్వచ్ఛతలో నిమగ్నం

హుస్నాబాద్ మున్సిఫ్ కోర్టు ఆవరణలో 'స్వచ్ఛతా హీ సేవ'లో భాగంగా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి శివరంజని, అదనపు కోర్టు జడ్జి కృష్ణతేజ్, కమిషనర్ మల్లికార్జున్, న్యాయవాదులు, సిబ్బంది చెత్తను ఊడ్చేశారు. స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్, కార్యదర్శి జుమ్‌లాల్, ఏజీపీ సదానందం పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, హుస్నాబాద్**



గ్రిల్స్ బాగయ్యాయి

సిద్దిపేట పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం చుట్టూ సుందరీకరణలో భాగంగా ఇనుప గ్రిల్స్ గతంలో ఏర్పాటు చేయగా ఇటీవల కొన్ని విరిగి రాకపోకలు సాగించేవారికి ప్రమాదకరంగా పరిణమించాయి. సమస్యను తెలుపుతూ గత నెల 27న 'విరిగితే.. సరిచేస్తే సరి' శీర్షికన 'ఈనాడు'లో ఫొటో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన కమిషనర్ ఆశ్రిత్‌కుమార్.. గ్రిల్స్‌కు మరమ్మతులు చేయించారు. **- న్యూస్‌టుడే, సిద్దిపేట**



కౌన్సిల్‌లో ఆరు అంశాలకు ఆమోదం

సిద్దిపేట, న్యూస్‌టుడే: సిద్దిపేటలో మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నామమాత్రంగా సాగింది. అరగంట వ్యవధిలోనే పూర్తి చేయడం అందుకు నిదర్శనం. బల్దియా అధ్యక్షురాలు మంజుల అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించారు. ప్రకటనల ఏజెన్సీ విభాగం గుత్తేదారు ప్రజాప్రతినిధులను గౌరవించడం లేదని, కాంట్రాక్టు రద్దు చేయాలని సభ్యులు కోరారు. కుక్కల బెడద, బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ గుర్తింపు, లాల్‌కమాన్ వద్ద ట్రాఫిక్ సమస్య లాంటివి ప్రస్తావించారు. అజెండాలోని ఏడు అంశాల్లో ఆరు ఆమోదం పొందాయి. ఎన్విరాన్‌మెంట్, ఇతర పరిధుల్లో పని చేసే ముగ్గురు ఉద్యోగులకు నెల వేతనం పెంపు అంశాన్ని తిరస్కరించారు. కమిషనర్ ఆశ్రిత్‌కుమార్, ఉపాధ్యక్షుడు కనకరాజు ఉన్నారు. రానున్న పండుగల నేపథ్యంలో నిధుల కేటాయింపుపై చర్చకు అవకాశం ఇవ్వలేదని కౌన్సిలర్ రియాజుద్దీన్ సమావేశం అనంతరం అన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చూడాలి


చిన్నకోడూరులో శిక్షణ ఇస్తున్న ఎస్ఈ శ్రీనివాస్‌చారి

చిన్నకోడూరు, న్యూస్‌టుడే: గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా శిక్షణ పొందిన పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్లు పని చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ శ్రీనివాస్‌చారి సూచించారు. చిన్నకోడూరు మండల పరిషత్తు కార్యాలయంలో మిషన్ భగీరథ ఆధ్వర్యంలో మంచినీటి సరఫరా సహాయకులకు సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బోర్లు, ఇంటింటా నల్లా కనెక్షన్ల తీరు, గేట్ వాల్వులు, పైపులైన్ మరమ్మతులు, క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఎంపీడీవో జనార్దన్, ఎంపీవో సోమిరెడ్డి, డీఈఈ సుమలత, ఏఈఈ సాయికిరణ్, సూపర్‌వైజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేటి నుంచి 'డీఎస్సీ' ధ్రువపత్రాల పరిశీలన

సిద్దిపేట, న్యూస్‌టుడే: డీఎస్సీ-2024 ఫలితాలు వెలువడిన నేపథ్యంలో 1:3 (నిష్పత్తి) ప్రాతిపాదికన అభ్యర్థుల ఎంపిక జరిగిందని, ఈ మేరకు జిల్లాలోని అభ్యర్థులకు ఆన్‌లైన్ విధానంలో చరవాణికి, మెయిల్ ద్వారా సందేశాలు చేరాయని డీఈవో శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. నేటి నుంచి 4 వరకు సిద్దిపేటలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేశామని, నిజ ధ్రువపత్రాల ధ్రువీకరణ చేపడతామన్నారు. వెబ్‌సైట్ నుంచి ఫారం డౌన్‌లోడ్ చేసుకొని వివరాలను పూరించి సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా విద్యా శాఖ వెబ్‌సైట్ www.deosiddipet.in సందర్శించాలని సూచించారు.

'ఆశా'వహ నినాదం



తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లాలోని ఆశా కార్యకర్తలు తెలంగాణ గ్రామీణ ఆశా వర్కర్ల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు సోమవారం ఆందోళన నిర్వహించారు. నినాదాలు చేశారు. సంఘం గౌరవాధ్యక్షుడు మంచె నర్సింలు, జిల్లా అధ్యక్షురాలు లక్ష్మి, ఉపాధ్యక్షులు కనకవ్వ పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. **- న్యూస్‌టుడే, సిద్దిపేట టౌన్**

'కార్మిక కోడ్‌లు రద్దు చేయాలి'

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కొనసాగించాలని కొత్తగా తీసుకొచ్చిన నాలుగు కోడ్‌లను రద్దు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు డిమాండ్ చేశారు. సిద్దిపేట శ్రామిక భవన్‌లో జరిగిన సమావేశానికి హాజరై మాట్లాడారు. పెట్టుబడిదారులకు అనుకూలంగా కార్మిక చట్టాలను మార్చారన్నారు. పింఛను చట్టాలను అమలు చేయాలని, మహాలక్ష్మి పథకంతో ఉపాధి కోల్పోతున్న ఆటో డ్రైవర్లకు నెలకు రూ.10 వేలు ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఆర్టీసీ, ఆశా, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులు, ఒప్పంద, పొరుగుసేవల ఉద్యోగుల సమస్యలను ప్రస్తావించారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ ఇమ్రాన్, సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, ఉపాధ్యక్షులు అందె అశోక్, పిట్ల మల్లేశం, సహాయ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రింగు రోడ్డు పనులు పునఃప్రారంభం

న్యూస్‌టుడే, గజ్వేల్: అర్ధాంతరంగా నిలిచిపోయిన రింగురోడ్డు నిర్మాణ పనులు పునఃప్రారంభమయ్యాయి. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ బల్దియా చుట్టూ గత ప్రభుత్వం రూ.230 కోట్ల భారీ వ్యయంతో చేపట్టింది. రింగు రోడ్డు పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాకపోవటంతో బల్దియాకు ట్రాఫిక్ కష్టాలు తప్పటం లేదు. మొత్తం 23 కిలోమీటర్ల పొడవున్న ఈ రోడ్డులో గజ్వేల్‌లో రైల్వేస్టేషన్ సమీపంలో వంతెన, 1.6 కిలోమీటర్ల పొడవు రోడ్డు, వర్గల్ రోడ్డులో మరో చోట 60 మీటర్ల మేర మిగిలిపోయింది. కొసరు పనులు ఎప్పటికి పూర్తవుతాయోనని స్థానికులు ఎదురు చూస్తుండగా ఎట్టకేలకు పనులు ప్రారంభం కావటంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గజ్వేల్, ప్రజ్ఞాపూర్, క్యాసారం, రిమ్మనగూడ, శ్రీగిరిపల్లి, ముట్రాజ్‌పల్లి, ధర్మారెడ్డిపల్లి, జాలిగామ, సంగాపూర్, సంగుపల్లి గ్రామాలను కలుపుతూ రింగురోడ్డు నిర్మిస్తున్నారు. చెన్నై, బెంగళూరు, నల్గొండ, సూర్యాపేట తదితర ప్రాంతాల నుంచి ముంబయి, పుణె, నిజామాబాద్ ప్రాంతాలకు సరకు రవాణాకు సులభమవుతుంది. ఇక్కడ వాణిజ్యపరంగా వృద్ధి చెంది ఉపాధి పెరగనుంది.

పాస్‌పోర్ట్ పోయినది

నా పేరు గంగారపు శ్రీనాథ్, S/o. పోచయ్య, గ్రా॥, మం॥ అక్కన్నపేట, సిద్దిపేట జిల్లా నా యొక్క పాస్‌పోర్ట్ తేది. 20-09-2024 రోజున అక్కన్నపేటలో మా ఇంటి నుండి భగత్‌సింగ్ మీ సేవకి వెళ్ళే మార్గమధ్యంలో నా యొక్క పాస్‌పోర్ట్ (నం. T9694493) పోయినది. దొరికినవారు క్రింది నంబర్‌కి సంప్రదించగలరు. తగిన పారితోషికం ఇవ్వబడును. సెల్: 970 1676 353.

దిగులు లేదిక

పత్తి రైతు ఖాతాల సమాచారానికి సీసీఐ 'కాటన్-అల్లై' యాప్ ఉందిక


జిన్నింగ్ కేంద్రంలో పత్తి కొనుగోళ్లు

న్యూస్‌టుడే, గజ్వేల్: సీసీఐ (భారత పత్తి సంస్థ)కు పత్తి విక్రయించిన రైతులు నగదు బ్యాంకు ఖాతాలో పడే వరకు ఉత్కంఠగా ఎదురు చూస్తుంటారు. కొన్ని సందర్భాల్లో సమయానికి నగదు జమ కాకపోవటంతో అధికారుల వద్దకు వెళ్లి వాకబు చేస్తుంటారు. ఇందుకోసం వ్యయ, ప్రయాసాలకు ఓర్చుతూ గ్రామాల నుంచి పట్టణంలోని కార్యాలయాలకు వెళ్తుంటారు. గతంలో కొన్ని జిల్లాల్లో పోస్టాఫీసు ఖాతాల్లో జమచేసిన పత్తి నగదును కొందరు వాడుకోవటం పెద్ద చర్చనీయాంశమైంది. కొన్ని చోట్ల రైతుల అప్పులకే జమకట్టేస్తున్నారు. ఈ విషయం తెలియక ఖాతాల్లో నగదు జమ అయిందా? లేదా? అని ఇటు బ్యాంకుల చుట్టూ, అటు సీసీఐ కార్యాలయాల చుట్టూ కర్షకులు తిరిగిన సంఘటనలు న్నాయి. ఈ ఇబ్బందులను అధిగమించేందుకు సీసీఐ 'కాటన్-అల్లై' పేరుతో కొత్త యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కసరత్తు చేస్తోంది. ఇది అందుబాటులోకి వస్తే మేలు చేకూరనుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

2023లో కొనుగోలు

కేంద్రం	రైతులు	కొనుగోలు (క్వింటాళ్లలో)
సీసీఐ	47,366	7,45,880
వ్యాపారులు	44,335	2,45,708

సంవత్సరం	గ్రేడు	మద్దతు ధర (క్వింటాలుకు రూ.లో)
2023	పొడవురకం	7020
	మధ్య రకం	6620
2024	పొడవు	7521
	మధ్య	7121

వాన ప్రభావం..
దిగుబడి తగ్గే అవకాశం

అంతర్జాలం వినియోగం పెరిగిన నేపథ్యంలో ప్రతి ఇంట్లో స్మార్ట్‌ఫోన్ అందుబాటులో ఉంటోంది. సీసీఐ తీసుకొచ్చే యాప్ ద్వారా పత్తి నగదు చెల్లింపు ప్రక్రియ ఏమేరకు వచ్చిందనే కచ్చితమైన సమాచారం తెలుసుకునే వీలు కలుగుతుందని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో ఈ సారి వానాకాలంలో 1.08 లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగైంది. సాధారణంగా ఎకరాకు 15 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. భారీ వర్షాలతో పలు చోట్ల పంట దెబ్బతిన్నది. దిగుబడిపై రైతుల్లో దిగులు నెలకొంది. సరాసరి ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్లు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లాలోని గతేడాది 24 జిన్నింగ్ మిల్లు కేంద్రాల్లో కొనుగోలు చేయగా ఈసారి 26 కేంద్రాలు, గజ్వేల్ మార్కెట్ యార్డులో పత్తి కొనుగోళ్లు చేపట్టే అవకాశం ఉంది.

పారిశ్రామిక పార్కు స్థలం పరిశీలన

అక్కన్నపేట(హుస్నాబాద్ గ్రామీణం), న్యూస్‌టుడే: అక్కన్నపేటలో కొత్తగా ఏర్పాటు చేయనున్న వ్యవసాయ ఆధారిత పరిశ్రమల కోసం కేటాయించిన ప్రభుత్వ భూమిని ఆర్డీవో రామ్మూర్తి సోమవారం పరిశీలించారు. తహసీల్దార్ అనంతరెడ్డి, ఆర్ఐ యాదగిరి, సర్వేయర్ లక్ష్మీనారాయణతో కలిసి అక్కడికి వెళ్లారు. ఈ పరిశ్రమల ఏర్పాటు కోసం గ్రామంలోని సర్వేనెం.387లో 83 ఎకరాల భూమిని కేటాయించారు. ఈ మేరకు అట్టి భూమిని తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థకు అప్పగించారు. ఆ భూమి సరిహద్దులు, నేల స్వభావం, ఎవరైనా మోకాపై ఉన్నారా అనే విషయాలను తెలుసుకున్నారు. ఎవరికీ అసైన్డ్ చేయని ప్రభుత్వ భూమిని మాత్రమే కేటాయించామని తహసీల్దార్ తెలిపారు.

ఆత్మీయ నేస్తాలు.. ప్రాణదాతలు

నేడు జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం

అత్యవసరం ఏర్పడితే.. బంధం లేకున్నా రక్తదానం చేసే దాతలు ఎందరో ఆదర్శంగా నిలుస్తున్నారు. నిండు ప్రాణాలు నిలబెట్టే వారు ప్రత్యక్ష దైవంగా భావిస్తుంటాం. చిన్నారి మొదలు వృద్ధుల వరకు వివిధ సమయాల్లో రక్తం దొరక్క అల్లాడుతుంటారు. వారికి మేమున్నామంటూ రక్తదానం చేసే వారు ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో భారీగా ఉండటం విశేషం. ఏ సమయమైనా ముందుకొస్తున్నారు. వ్యక్తిగతంగా, బృందాలుగా బాధ్యతను నిర్వర్తిస్తున్నారు. అలాంటి ఆత్మీయులపై జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా 'న్యూస్‌టుడే' కథనం.

ఈ సారు.. 49 సార్లు




సిద్దిపేట వాసి, మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా. కె. హుస్సేన్ ఇప్పటి వరకు 49 సార్లు రక్తదానం చేశారు. ఓ+ గ్రూపు కాగా.. 18వ ఏట నుంచే ఇస్తున్నారు. డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ఓ మహిళకు అత్యవసరం కాగా, వెంటనే స్పందించడంతో ప్రాణం నిలబడటం సంతృప్తినిచ్చింది. అప్పటి నుంచి 30 ఏళ్లుగా అత్యవసరంలో స్పందిస్తున్నారు. సర్కారు దవాఖానాల్లో చికిత్స పొందే నిరుపేదలకు తొలి ప్రాధాన్యంగా రక్తదానం చేస్తున్నారు.

సామాజిక బాధ్యతగా..



సిద్దిపేట జిల్లాలో సామాజిక మాధ్యమాల వేదికగా పలువురు ఆపన్నహస్తాన్ని అందిస్తున్నారు. పోలీసు బ్లడ్ ఆర్గనైజేషన్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి బ్లడ్ గ్రూపు (సిద్దిపేట), సిద్దిపేట బ్లడ్ బ్యాంకు వంటి వాట్సాప్ గ్రూప్‌ల్లో అన్ని వర్గాల వారు భాగస్వాములయ్యారు. ఆరేళ్లలో 2500 మందికి పైగా రక్తదానం చేశారు. 2 వేల మంది వివరాలు ఉండగా, సమన్వయంతో ముందుకు సాగుతున్నట్లు కుకునూరుపల్లి పోలీసు కానిస్టేబుల్ దాసరి చంద్రశేఖర్ తెలిపారు.



యువ సారథ్యం.. స్ఫూర్తి మంత్రం

బీఎస్‌డీఎఫ్ (భారత్ సొసైటీ డెవలప్‌మెంట్ ఫోర్సు) ఆధ్వర్యంలో పదేళ్ల కిందట బ్లడ్ సర్కిల్ గ్రూపు ఏర్పాటు చేశారు. అనుబంధంగా 16 వాట్సాప్ గ్రూపులు ఉండగా.. వాటిల్లో మొత్తం 2 వేల మంది సభ్యులున్నారు. రక్తదానంపై అవగాహన కల్పిస్తున్నారు. అత్యవసరంలో ఏటా 300 మంది స్పందిస్తున్నారు. స్ఫూర్తిని కొనసాగిస్తున్నామని వ్యవస్థాపక అధ్యక్షుడు నాగార్జున్, సమన్వయకర్త భాను వెల్లడించారు.



రక్తదాతలు

తల్లిదండ్రుల ఆనందం చూసి..



2011లో తలసేమియాతో బాధపడుతున్న చిన్నారికి రక్తదానం చేయగా.. ఆ తల్లిదండ్రుల కళ్లలో కనిపించిన ఆనందం అతడికి రక్తదానం చేసేలా ప్రేరేపించింది. అప్పటి నుంచి ఇప్పటివరకు 48 సార్లు రక్తదానం చేశారు. అతడే మెదక్ జిల్లా పాపన్నపేట మండలం కుర్తివాడకు చెందిన బూర్జుకాడి నరేష్, ఎంకాం చదువుతున్నప్పుడు అమ్మ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్‌తో కలిసి పని చేయడం ఈ దిశగా అడుగేయడానికి తోడ్పడింది.

శిబిరాలు నిర్వహిస్తూ..



సంగారెడ్డి జిల్లా నాగలిగిద్ద మండలం ఉటిపల్లికి చెందిన **ఓంప్రకాశ్..** ఇప్పటివరకు 40 సార్లు రక్తదానం చేశారు. ఇతడిది ఓ- నెగెటివ్ గ్రూప్. ఈ గ్రూప్ వారు అరుదుగా ఉంటారు. రెండు నెలలకోసారి నారాయణఖేడ్‌లో శిబిరాలు నిర్వహిస్తూ యువత రక్తదానం చేసేలా ప్రోత్సహిస్తున్నారు. 63050-43932 నంబరుకు ఫోన్ చేస్తే చాలు దానం చేయడానికి సిద్ధంగా ఉంటారు.

ఎవరు చేయొచ్చంటే..

- 18 - 55 ఏళ్లున్న వారు ఎవరైనా రక్తదానం చేయొచ్చు.
- మూడు నెలల వ్యవధితో ఏడాదికి నాలుగుసార్లు ఇవ్వొచ్చు.
- ఒక వ్యక్తి రక్తదానం చేయడం ద్వారా ముగ్గురు ప్రాణాలను కాపాడవచ్చు.

159 సార్లు ముందుకొచ్చి..



ఎవరికైనా రక్తం అత్యవసరమని తెలిస్తే చాలు వెంటనే అక్కడికి వెళ్లిపోతారు...తాండూరుకు చెందిన వైద్యుడు సంపత్‌కుమార్.. ఇప్పటివరకు 159 సార్లు రక్తదానం చేశారు.

నాన్న స్ఫూర్తితో..



సంగారెడ్డికి చెందిన సాజిద్ అలీ తండ్రి షబ్బీర్‌అలీ. నాన్న స్ఫూర్తిగా రక్తదానం చేసేందుకు ముందుకొచ్చారు. ప్రాణాపాయ పరిస్థితుల్లో ఉన్న కాన్పు, రోడ్డు ప్రమాదాల బాధితులకు రక్తం ఇచ్చి కాపాడారు. ఎవరికైనా, ఎప్పుడైనా అత్యవసరమైతే 96527-86001 నంబరుకు ఫోన్ చేస్తే చాలు సిద్ధంగా ఉంటారు.

న్యూస్‌టుడే, సిద్దిపేట, సంగారెడ్డి అర్బన్, తాండూరు నారాయణఖేడ్ రూరల్, మెదక్ టౌన్

'మల్లన్న' హుండీ ఆదాయం రూ.63.66 లక్షలు



కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది, భక్తులు

చేర్యాల: కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయానికి హుండీల ద్వారా రూ.63.66 లక్షల నగదుతో పాటు బంగారు, వెండి కానుకలు వచ్చినట్లు ఈవో ఆలూరు బాలాజీశర్మ తెలిపారు. మెదక్ జిల్లా దేవాదాయశాఖ సహాయ కమిషనరు చంద్రశేఖర్ పర్యవేక్షణలో సోమవారం మొత్తం 24 హుండీలను విప్పి భక్తులు సమర్పించిన నగదు, ఆభరణాల లెక్కింపు చేపట్టారు. రూ.63,66,933 నగదు, 51 గ్రాముల మిశ్రమ బంగారం, ఒక కిలో 50 గ్రాముల మిశ్రమ వెండి కానుకలు, 25 విదేశీ కరెన్సీ, 6 క్వింటాళ్ల బియ్యం వచ్చినట్టు చెప్పారు. ఇది 76 రోజుల్లో సమకూరిందని పేర్కొన్నారు. ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్, ఏఈవో బుద్ధి శ్రీనివాస్, పర్యవేక్షకులు, అర్చకులు, సిబ్బంది, సిరిసిల్లకు చెందిన శివరామకృష్ణ భజన మండలి 200 మంది సభ్యులు పాల్గొన్నారు.

విదేశీ భాషలు నేర్చుకుంటే ఉన్నతస్థానం

సిద్దిపేట టౌన్: విదేశీ భాషలు నేర్చుకుంటే విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదగవచ్చని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట ఇందిరానగర్ జడ్పీ ఉన్నత పాఠశాల రాష్ట్రానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఇఫ్లూ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో పాఠశాలలో విదేశీ భాషలు నేర్చుకున్న విద్యార్థులకు సోమవారం ధ్రువపత్రాలను ఆయన అందజేశారు. పలువురు విద్యార్థులు తాము నేర్చుకున్న ఇంగ్లిష్, ఫ్రెంచి, స్పానిష్ భాషల్లో సంభాషించి అబ్బురపరిచారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు. పాఠశాల కోసం ఆడిటోరియం ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులు కోరగా రూ.10 లక్షలు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. అదనపు తరగతి గదులు, మురుగు పారుదల వ్యవస్థకు నాట్కో నుంచి రూ.40 లక్షలు ఇస్తామని చెప్పారు. 10 జీపీఏ సాధించిన విద్యార్థులందరికీ తన సొంత ఖర్చుతో ఐప్యాడ్‌లు అందజేస్తానని హామీ ఇచ్చారు. ఉపాధ్యాయులను సన్మానిస్తానన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాజప్రభాకర్‌రెడ్డి, సెక్టోరల్ అధికారి రామస్వామి, భారాస నాయకులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలకు సాంకేతికత అవసరం



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న వీసీ, అనురాగ్ వర్సిటీ అధికారులు

ములుగు: ఉద్యాన పంటల సాగులో సాంకేతిక విద్య ఎంతో అవసరమని సిద్దిపేట జిల్లా ములుగులోని కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి నీరజ ప్రభాకర్ అన్నారు. సోమవారం పరిపాలన విభాగం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన అనురాగ్ వర్సిటీ, ఉద్యాన విశ్వవిద్యాలయం మధ్య పలు అంశాలపై పరస్పర ఒప్పందం కుదుర్చుకున్నాయి. భవిష్యత్తులో రెండు సంస్థల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. రిజిస్ట్రార్ భగవాన్, డీన్‌లు లక్ష్మీనారాయణ, రాజశేఖర్, విజయ, అనురాగ్ విశ్వవిద్యాలయం అధికారులు అర్చన, నారాయణరెడ్డి, ప్రతిభ పాల్గొన్నారు.

చికెన్ ధరలు			
ఫాంరేటు	110-00	డ్రెస్డ్	191-00
రిటైల్	132-00	స్కిన్‌లెస్	218-00

హ్యాండ్‌బాల్ ఉమ్మడి మెదక్ జిల్లా జట్ల ఎంపిక

హుస్నాబాద్, న్యూస్‌టుడే: హుస్నాబాద్‌లో సోమవారం ఉమ్మడి మెదక్ జిల్లా హ్యాండ్‌బాల్ జట్లు ఎంపిక చేశారు. స్థానిక మినీ స్టేడియంలో జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో అండర్-17 బాలబాలికల హ్యాండ్‌బాల్ పోటీలు నిర్వహించారు. పురపాలిక అధ్యక్షురాలు ఆకుల రజిత ప్రారంభించారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఎంపికైన వారు అక్టోబరు 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు నారాయణపేట జిల్లా కోస్గిలో జరిగే టోర్నీలో పాల్గొంటారు. హెచ్‌ఎం వాసుదేవరెడ్డి, పుర ఉపాధ్యక్షురాలు ఐలేని అనిత, లింగమూర్తి, రాజు, ఆర్. శ్రీనివాస్, కౌన్సిలర్లు నళిని, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

భారతసైన్యానికి మరో అధునాతన ఆయుధం



ఆయుధాల వాహనాన్ని ప్రారంభిస్తున్న మేజర్ జనరల్ రాకేశ్‌కుమార్ మనోచా

మనోహరాబాద్, న్యూస్‌టుడే: అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో డీఆర్‌డీవో, భారత సైన్యం సహకారంతో మేకిన్ ఇండియాలో భాగంగా అధునాతన మెషిన్‌గన్‌ను తయారు చేశామని లోకేశ్ మెషిన్ లిమిటెడ్ కోఛైర్మన్ శ్రీకృష్ణ అన్నారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కాళ్లకల్ పారిశ్రామికవాడలో లోకేష్ మెషిన్ పరిశ్రమ తయారు చేసిన 9x19 ఎంఎం 550 మెషిన్‌గన్‌లను సోమవారం దిల్లీకి తరలించే వాహనాన్ని మేజర్ జనరల్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఎస్‌ఎం, వీఎస్‌ఎం, జీవోసీ రాకేశ్‌కుమార్ మనోచా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనకు శ్రీకృష్ణ, ఆర్మీ అధికారులు ఘన స్వాగతం పలికారు. పరిశ్రమలో ప్రదర్శనకు ఉంచిన ఆయుధాల పనితీరు, తయారీకి వాడిన ముడి సరకుల సమాచారాన్ని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విదేశాల నుంచి ముడిసరకు దిగుమతి చేసుకోకుండా తయారు చేయడం మంచి పరిణామమని, ఇలాంటివి భారత సైన్యానికి ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పరిశ్రమ ఎండీ లోకేశ్వరరావు, విశ్రాంత ఆర్మీ అధికారి రాజీవ్ శర్మ, ఆర్మీ అధికారులు, పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో ప్రతిభ



పతకాలు సాధించిన క్రీడాకారులు

సిద్దిపేట టౌన్: నిజామాబాద్‌లో ఇటీవల తెలంగాణ యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో సిద్దిపేట క్రీడాకారులు ప్రతిభ చాటారు. అండర్-18 విభాగంలో రిథమిక్ పేర్(జంట) అంశంలో ఎల్. సింధూరి, మనీషా స్వర్ణాలు సాధించారు. 45 -55 పురుషుల విభాగంలో ట్రెడిషనల్ అంశంలో పల్లె సురేశ్ స్వర్ణ పతకం, మహిళల విభాగంలో ఉమాదేవి నాలుగో స్థానంలో నిలిచారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తోట అశోక్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డిలు వారిని శిక్షకులు సతీష్, సంధ్యలను అభినందించారు.

మహిళా ప్రయాణికులే లక్ష్యంగా చోరీలు



అరెస్టయిన నిందితులు

రెజిమెంటల్‌బజార్: మహిళా ప్రయాణికులే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలు, చోరీ వస్తువులను కొనుగోలు చేసిన ఇద్దరిని టాస్క్‌ఫోర్స్, గోపాలపురం పోలీసులు అరెస్టు చేశారు వారి నుంచి 20 చరవాణులు, ఓ బైక్ స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ వై.వి.ఎస్. సుధీంద్ర తెలిపిన వివరాలు.. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌కు చెందిన సిరిగిరి కవిత పండ్లు విక్రయిస్తుంది. మేడ్చల్‌కు చెందిన ఆమె మరిది వాంకుడోత్ ప్రసాద్ ఆటోడ్రైవర్. వచ్చే ఆదాయం చాలక ఇద్దరూ కలిసి చోరీల బాటపట్టారు. రద్దీ ప్రాంతాల్లో, ఆర్టీసీ బస్సుల్లో, మహిళల బ్యాగుల్లోని చరవాణులు దొంగిలించి, వాటిని కాచిగూడకు చెందిన మహ్మద్ రఫీయుద్దీన్, మహ్మద్ ఇస్మాయిల్‌కు విక్రయిస్తున్నారు. ఫిర్యాదులు రాగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితులు రైల్వేస్టేషన్ ప్రాంతంలో అనుమానాస్పదంగా కనిపించగా అదుపులోకి తీసుకుని విచారించగానేరం అంగీకరించారు. గోపాలపురం, ఉప్పల్, కామారెడ్డి, ఓయూ, గౌరారం, సిద్దిపేట, పేట్‌బషీరాబాద్, రామాయంపేట, మేడ్చల్ పరిధిలో చోరీలకు పాల్పడ్డారు. గతంలోనూ 13 కేసుల్లో నిందితులుగా ఉన్నారు. సొత్తు కొనుగోలు చేసిన వారినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

పూల తోట.. సస్యరక్షణతోనే దిగుబడి

రైతేరాజు

న్యూస్‌టుడే, చేర్యాల

డిమాండ్‌తో పాటు సీజన్‌కు అనుగుణంగా పంటల సాగు లాభదాయకం. రానున్నది పండగల సీజన్. ఈ తరుణంలో పూలకు డిమాండ్‌కు అధికంగా ఉంటుంది. ఇటీవల కురిసిన వర్షాలు, మారిన వాతావరణంతో పూల తోటల్లో సస్యరక్షణ చర్యలు ఎంతో అవసరం. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో బంతి, చామంతి, మల్లె, కనకాంబరం ఎక్కువగా తోటలు సాగు చేస్తున్నారు. ఈ తరుణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిద్దిపేట తోర్నాల వ్యవసాయ పరిశోధన కేంద్రం కోఆర్డినేటర్, సీనియర్ శాస్త్రవేత్త డాక్టరు జక్కుల విజయ్ ఇలా వివరించారు.



బంతి..: బంతి తోటలో ప్రస్తుతం పేనుబంక సమస్య అధికంగా ఉంటుంది. ఇవి మొక్కలోని రసాన్ని పీల్చుకుంటాయి. ఆశించిన దిగుబడి రాదు. నివారణకు ఎసిఫేట్ 1 గ్రా. లేదా డైమిథోయేట్ 2 మి.లీ. మందును లీటరు నీటికి కలిపి 15 రోజులకోసారి పిచికారీ చేయాలి. దీపపు పురుగులు ఆకులపై ఎక్కువగా ఆశిస్తాయి. నివారణకు 0.3 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్ మందును లీటరు నీటికి కలిపి చల్లాలి.

- గొంగళి పురుగు ఆశించి కొనభాగాలను తిని ఈనెలను మిగులుస్తాయి. స్పైనోశాడ్ 0.3మి.లీ. లేదా సైపర్‌మెత్రిన్ 1 మి.లీ... లీటరు నీటికి కలిపి చల్లితే ఫలితం ఉంటుంది.

గులాబీ..: గులాబీ తోటలకు పెంకు పురుగులు ఆశించి రాత్రివేళ ఆకులు తిని నష్టం కలిగిస్తాయి. నివారణకు క్లోరిఫైరిఫాస్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఆకులపై బూడిద తెగులు ఆశిస్తే బూడిద వంటి తెల్లటి పదార్థం ఏర్పడి ఆకులు ముడుచుకుంటాయి. నివారణకు ప్రొపికొనజోల్ 1 మి.లీ. లేదా డినోకాప్ 1 మి.లీ. మందు లీటరు నీటికి కలిపి చల్లాలి. ● ఎండు తెగులు ఆశించి మొక్క పైభాగం నుంచి కిందికి ఎండిపోతుంది. నివారణకు తెగులు సోకిన కొమ్మను కత్తిరించాలి. ఆయా చోట్ల కాపర్ ఆక్సీక్లోరైడ్ పేస్టును పూయాలి.



మల్లెపూలు..: ప్రస్తుతం మల్లె తోటలకు మొగ్గతొలుచు పురుగు ఆశిస్తోంది. పురుగు లార్వా మొగ్గలోకి చొచ్చుకెళ్లి తినేస్తుంది. నివారణకు మలాథియాన్ మందు 2 మి.లీ. లేదా థయాక్లోప్రిడ్ 1 మి.లీ. లేదా స్పైనోశాడ్ 0.3 మి.లీ. మందును లీటరు నీటికి కలిపి చల్లితే ఫలితం ఉంటుంది.

కనకాంబరం..: ఈ తోటలకు ప్రస్తుతం నులిపురుగులు ఎక్కువగా ఆశిస్తాయి. వీటి వల్ల ఆకులు ముడుచుకొని ఊదారంగుకు మారుతాయి. మొక్కలు గిడసబారుతాయి. నివారణకు 10కిలోల కార్బోఫ్యూరాన్ గుళికలు వేసి భూమిలో కలిపి నీరు పెట్టాలి. ఎకరాకు 200 కిలోల వేప పిండి వేయాలి. ఎండు తెగులు సోకి ఆకులు కిందికి వాలుతాయి. కాండం కుళ్లిపోతుంది. చివరకు మొక్కలు చనిపోతాయి. నివారణకు లీటరు నీటికి 2.5 గ్రా. మాంకోజెట్ లేదా 0.75 గ్రా. ట్రైఫ్లోక్సీస్ట్రోబిన్‌తో టెబుకోనజోల్‌ను కలిపి 20-25 మి.లీ. మందు ద్రావణంతో మొక్క మొదలు చుట్టూ నేల తడిసేలా చల్లాలి.

సాగులో సందేహాలా?

సంప్రదించాల్సిన ఫోన్ నం: 93815 15588

సాగు పద్ధతులు, చీడపీడల నివారణ, సస్యరక్షణపై రైతుల ప్రశ్నలకు సిద్దిపేట తోర్నాల వ్యవసాయ పరిశోధన కేంద్రం సమన్వయకర్త విజయ్ సమాధానాలు ఇచ్చారు.

ప్రశ్న: పత్తికి పచ్చ దోమ ఆశించింది. నివారణ చర్యలు తెలపండి? – సుదర్శన్, చేగుంట

సమాధానం: 0.25 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్, ఎసిఫేట్ 1.5 గ్రాములు, ఫిప్రోనిల్ 2 మి.లీ... లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే ఫలితం ఉంటుంది.

– న్యూస్‌టుడే, చేర్యాల

పాటించు.. నివారించు..




వాతావరణంలో మార్పులతో కాకర తోటలకు చీడపీడలు ఆశించే అవకాశం ఉంది. పండు ఈగ ఆశించి నష్టపరుస్తుంది. సన్నని పురుగులు కాయ గుజ్జును తినేస్తాయి. నివారణకు లీటరు నీటిలో మలాథియాన్ 2 మి.లీ. కలిపి పిచికారీ చేయాలి. రాలిపోయిన కాయలను ఏరి కాల్చివేయాలి. ఎకరాకు 4 నుంచి 5 లింగాకర్షక బుట్టలు ఏర్పాటుచేయాలి. ● ప్రస్తుతం పాముపొడ పురుగు ఆశిస్తుంది. గొంగళి పురుగు మాదిరిగా ఉండి ఆకు పొరల్లో చొచ్చుకుపోతాయి. నివారణకు ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. మందును లీటరు నీటిలో కలిపి చల్లాలి. పూత వచ్చే వరకు 5 శాతం వేప గింజల కషాయాన్ని 15 రోజులకోసారి చల్లాలి.

– న్యూస్‌టుడే, పాపన్నపేట

పత్తిలో ఆకుమచ్చ తెగులా..

ఇటీవలి భారీ వర్షాల అనంతరం పత్తి పంటను ఆకు మచ్చ తెగులు, పిండినల్లి పురుగులు ఎక్కువగా ఆశిస్తున్నాయి. వీటి నివారణకు తగిన మోతాదులో మందులు వాడాలి. ఆకుమచ్చ తెగులు నివారణకు ప్లాంటో మైసీన్ లేదా స్ట్రెప్టోమైసీన్ 0.2 గ్రా., కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను 3 గ్రా... లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పిండినల్లి పురుగు నివారణకు లీటరు నీటికి 2 గ్రా. ఎసిఫేట్‌తో పాటు 1 మి.లీ. శాండోవిట్ జిగురు మందు కలిపి మొక్క తడిచేలా పిచికారీ చేయాలి. – జహీరాబాద్ అర్బన్

సమయానుకూల సాగు.. లాభాలు బాగు





సమయం, డిమాండ్‌కు అనుగుణంగా పంటల సాగు లాభదాయకమని నిరూపిస్తున్నారు గుమ్మడిదల మండలం వీరన్నగూడెంకు చెందిన రాంచందర్. ఈయనకు రెండెకరాల పొలం ఉంది. ఇందులో సాధారణంగా వరితో పాటు కూరగాయలు సాగు చేస్తుంటారు. పండగలు సీజన్ వచ్చిందంటే మాత్రం పూల సాగు బాట పడతారు. ఏటా దసరా, దీపావళి, కార్తిక మాసం వచ్చే ముందు బంతి పూలు పండిస్తున్నారు. ఎకరా పొలంలో ఎర్ర, పసుపు పచ్చ రకాలను సాగు చేస్తున్నారు. నాణ్యమైన విత్తనాలు తెచ్చి నాటడంతో పాటు అన్ని రకాల సస్యరక్షణ చర్యలు తీసుకుంటున్నారు. నాటు వేసింది మొదలు పూత వచ్చే వరకు నిత్యం కంటికి రెప్పలా కాపాడుకుంటారు. పురుగులు ఆశించినట్లు గుర్తించగానే అధికారుల సూచనలతో మందులు పిచికారీ చేస్తున్నారు. విత్తనాలు, మందులు, ఇతరత్రా వాటికి ఎకరాకు రూ.50 వేల వరకు పెట్టుబడి అవుతోంది. దసరా నుంచి మొదలుకొని కార్తికమాసం చివరి వరకు నాలుగు కాతలు చేతికొస్తున్నాయి. ఒక్కో కాతకు ఎకరాకు 6 క్వింటాళ్ల మేర దిగుబడి వస్తోంది. మొత్తం సీజనలో 24 క్వింటాళ్ల మేర దిగుబడి సాధిస్తున్నారు. హైదరాబాద్, జిన్నారం, బొంతపల్లి మార్కెట్‌కు తరలించి విక్రయిస్తున్నారు. వీటి అమ్మకం ద్వారా రూ.లక్ష వరకు ఆదాయం ఆర్జిస్తున్నారు. పెట్టుబడి పోను రూ.50 వేల వరకు మిగులుతోంది. ఈ లెక్కన ఎకరాలో పూల సాగుతో రూ.2 లక్షల వరకు ఆర్జిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలిచారు.

- న్యూస్‌టుడే, గుమ్మడిదల

పోలీసులు వచ్చె.. గ్రామస్థులు అడ్డుకునే..

గురువన్నపేటలో రెండో రోజూ ఉద్రిక్తత



నిందితుడి ఇంటిపై దాడి చేసిన వారిని పోలీసులు తీసుకెళ్తుండగా అడ్డుకుంటున్న గ్రామస్థులు

చేర్యాల, న్యూస్‌టుడే: బాలికపై అత్యాచారం ఘటన జరిగిన సిద్దిపేట జిల్లా చేర్యాల సర్కిల్ పరిధిలోని గురువన్నపేట గ్రామంలో రెండో రోజు సోమవారమూ ఉద్రిక్తత నెలకొంది. ఆదివారం నిందితుడి ఇంటికి నిప్పు పెట్టి, కారు ధ్వంసం చేసిన ఘటనలో కేసు నమోదైన నిందితులను అదుపులోకి తీసుకోవడానికి సోమవారం ఉదయం పోలీసులు గ్రామానికి వచ్చారు. వారిలో ఆరుగురిని వాహనంలో ఎక్కించుకొని తరలిస్తుండగా పోలీసు వాహనాలను గ్రామస్థులు అడ్డుకున్నారు. దారికి అడ్డంగా బైఠాయించారు. హుస్నాబాద్ ఏసీపీ సతీశ్, చేర్యాల సీఐ శ్రీను, ఎస్సై రాజు చేరుకొని సముదాయించే ప్రయత్నం చేశారు. ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు అదనపు బలగాలను రప్పించారు. అదుపులోకి తీసుకున్న వారిని వదిలిపెట్టాలని గ్రామస్థులు నినాదాలు చేశారు. గత్యంతరం లేక చివరకు వాహనాల్లో ఉన్న ఆరుగురిని పోలీసులు వదిలిపెట్టారు. అదనపు డీసీపీ మల్లారెడ్డి మాట్లాడుతూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదన్నారు. అత్యాచార బాధిత కుటుంబాన్ని భాజపా మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి, జనగామ జిల్లా అధ్యక్షుడు దశమంతరెడ్డి, మహిళ విభాగం అధ్యక్షురాలు లక్ష్మి, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి సురేశ్, నాయకులు పరామర్శించారు. నిందితుడికి కఠిన శిక్ష పడాలని వారు డిమాండ్ చేశారు.

అంత్యక్రియలకు వెళ్తూ ట్రాక్టర్ బోల్తా

ఒకరి దుర్మరణం పలువురికి గాయాలు

దౌల్తాబాద్: అంత్యక్రియలకు వెళ్తూ ట్రాక్టర్ బోల్తాపడి ఒకరు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ ఎస్‌ఐ రవిగౌడ్ తెలిపిన వివరాలు.. మండలంలోని ఈర్లపల్లి నుంచి నాగసార్‌కు బంధువుల అంత్యక్రియల నిమిత్తం ట్రాక్టర్‌లో బయలుదేరారు. దేవర్‌పస్లావాద్ సమీపంలో ట్రాక్టర్ అదుపుతప్పి పొలంలోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఈర్లపల్లికి చెందిన మాల అమృతమ్మ (51) అక్కడికక్కడే మృతి చెందింది. మాల కిష్టప్ప, నర్సమ్మ, అచ్చన్న, కవిత, దస్తమ్మ, బాలమ్మ, బసప్పలకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం ప్రైవేట్ వాహనాల్లో కొడంగల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబీకుడు లాలప్ప ఫిర్యాదుతో కేసు నమోదైంది.

కారు టైరు పేలి ఒకరు..

బొంరాస్‌పేట (కొడంగల్): వేగంగా వెళ్తున్న కారు టైర్ పేలడంతో ప్రమాదానికి గురై ఒకరు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్‌ఐ రవూఫ్ తెలిపిన వివరాలు.. సోమవారం అర్ధరాత్రి ఒంటి గంట ప్రాంతంలో హైదరాబాద్ నుంచి కర్ణాటకలోని మల్కేడ్‌కు బయల్దేరిన ఓ కారు బొంరాస్‌పేట చెరువు మలుపు వద్ద టైర్ పేలి అదుపు తప్పి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది. కారులో ప్రయాణిస్తున్న విశ్వనాథ్ (49) అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరు.. రవికుమార్, రవిచంద్రలకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని హైదరాబాద్‌కు తరలించారు. మృతుడు మల్కేడ్ వాసిగా గుర్తించారు. భాస్కర్‌రావు ఫిర్యాదుతో కేసు నమోదైంది.

బైక్‌తో చెట్టును ఢీకొని మేస్త్రీ..

వెల్దుర్తి: అతివేగంగా ద్విచక్ర వాహనంపై వస్తూ అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టి ఓ వ్యక్తి మృతి చెందాడు. మెదక్ జిల్లా వెల్దుర్తి ఏఎస్‌ఐ సాదత్‌మియా తెలిపిన వివరాలు.. కర్నూల్ జిల్లా ఎమునూర్‌కు చెందిన కట్ల రమేష్(35) మండలంలోని మానేపల్లిలో ఉంటూ మేస్త్రీగా పని చేస్తున్న అదే జిల్లాకు చెందిన పాలపర్తి శ్రీనివాస్ వద్దకు పది రోజుల క్రితం వచ్చాడు. అతడి వద్ద పనికి చేరాడు. సోమవారం మానేపల్లి పక్క గ్రామం అందుగులపల్లికి పని నిమిత్తం వెళ్లాడు. సాయంత్రం ద్విచక్రవాహనంపై తిరిగి బయల్దేరాడు. వేగంగా వస్తూ అందుగులపల్లి శివారులో ఓ చెట్టుకు ఢీకొట్టి పడిపోగా తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి వెళ్లి పరిశీలించారు. మృతుడు రమేష్ వివరాల కోసం శ్రీనివాస్‌ను అడగ్గా భార్యాపిల్లలు ముంబయిలో ఉంటారని, వారి చిరునామా తెలియదని చెప్పాడు. ఇంకా ఫిర్యాదు అందలేదని, రాగానే కేసు నమోదు చేస్తామని ఏఎస్‌ఐ వివరించారు.

బాలిక మరణానికి కారణమైన.. దంపతులకు జీవిత ఖైదు

సంగారెడ్డి అర్బన్: ఐదేళ్ల బాలికను చిత్రహింసలకు గురిచేసి మరణానికి కారణమైన దంపతులకు జీవిత ఖైదు విధిస్తూ ఫ్యామిలీ కోర్టు నాలుగో సెషన్స్ కోర్టు న్యాయమూర్తి కోట్ల లావణ్య బాల్‌రెడ్డి సోమవారం తీర్పు ఇచ్చిందని సంగారెడ్డి ఎస్పీ రూపేష్ తెలిపారు. కొండాపూర్ మండలం మల్కాపూర్‌లోని గాంధీనగర్‌కు చెందిన సయ్యద్ జకీర్ అహ్మద్ హెడ్ కానిస్టేబుల్. గతంలో ఐడీఏ బొల్లారంలో పని చేశాడు. సతీమణి రజియా సుల్తానాతో కలిసి కొండాపూర్‌లో నివాసం ఉన్నాడు. వారింట్లో ఐదేళ్ల బాలికను పనిలో పెట్టుకున్నారు. పని సరిగా చేయ లేదని బాలికను చితకబాదగా.. అపస్మారకస్థితికి చేరింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. 2015, జనవరి 29న ఈ ఘటన జరిగింది. చైల్డ్ హెల్ప్‌లైన్ అధికారి ఎం.ఎస్. చంద్ర కొండాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో వివరాలు సమర్పించారు. పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి దంపతులిద్దరికీ జీవితఖైదు విధించారు.

రెండోసారి ఆత్మహత్యాయత్నం.. చికిత్స పొందుతూ మృతి



మంగవ్వ

దుబ్బాక: ఆర్నెల్ల క్రితం బావి వద్దకు వెళ్లి ఆత్మహత్య చేసుకుంటానని ఓ వృద్ధురాలు యత్నించగా కుటుంబ సభ్యులు కాపాడారు. సెప్టెంబరు 22న ఆమె మద్యం మత్తులో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. సిద్దిపేట జిల్లా దుబ్బాక ఎస్‌ఐ వి.గంగరాజు తెలిపిన వివరాలు.. మండలంలోని అప్పనపల్లికి చెందిన గ్యార మైసయ్య కూలీ పనులు చేస్తూ, భార్య మంగవ్వ (66), ఇద్దరు కుమారులతో కలిసి జీవనం కొనసాగిస్తున్నాడు. మంగవ్వకు మద్యం తాగే అలవాటుంది. సెప్టెంబరు 22న బంధువు అంత్యక్రియలకు వెళ్లి, మద్యం తాగి ఇంటికి వచ్చింది. కుటుంబీకులతో గొడవపడింది. గడ్డి మందు తాగింది. కుటుంబీకులు గుర్తించి 108 వాహనంలో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి, మెరుగైన చికిత్సకు హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. మైసయ్య ఫిర్యాదుతో కేసు నమోదైంది.

పంపుహౌస్ ప్రైవేటు ఇంజినీర్ ఆత్మహత్య



వెంకటేశ్

గజ్వేల్ గ్రామీణ: కొండపోచమ్మ సాగర్‌కు సంబంధించిన పంపుహౌస్ వద్ద ఇంజినీర్‌గా పని చేస్తున్న యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. సిద్దిపేట జిల్లా మక్తమాసాన్‌పల్లికి చెందిన చింత వెంకటేశ్ (26)కు భార్య శిరీష, ఏడాదిన్నర వయసున్న కుమారుడు ఉన్నారు. గజ్వేల్ మండలం అక్కారం శివారు పంపుహౌస్‌లో ప్రైవేటు కంపెనీలో ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం విధులకు హాజరైన వెంకటేశ్.. తోటి ఉద్యోగులు రమ్మని పిలిచినా మధ్యాహ్న భోజనానికి వెళ్లలేదు. అందరూ భోజనానికి వెళ్లగానే తాను ఉన్న గదిలోనే ఉరేసుకున్నాడు. తోటివారు వచ్చి కిందికి దించి గజ్వేల్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే వెంకటేశ్ మృతి చెందినట్లు వైద్యులు తేల్చిచెప్పారు. ఈ ఘటనపై ఫిర్యాదు రాలేదని గజ్వేల్ సీఐ సైదా తెలిపారు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

మంత్రి సీతక్కకు కాంగ్రెస్ శ్రేణుల స్వాగతం



బెజ్జంకి, న్యూస్‌టుడే: కరీంనగర్ జిల్లాలో పలు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళ్తున్న పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కకు బెజ్జంకిక్రాసింగ్ రాజీవ్ రహదారి కూడలిలో సోమవారం కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఆమెను సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రత్నాకర్‌రెడ్డి, దామోదర్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్, సంతోష్, రాములు, ఐలయ్య, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

మర్పడ్గ మల్లన్నకు అన్నాభిషేకం

కొండపాక గ్రామీణం, న్యూస్‌టుడే: కొండపాక మండలం మర్పడ్గలోని మల్లికార్జున స్వామి క్షేత్రంలో మాస శివరాత్రి పురస్కరించుకుని సోమవారం సంతాన మల్లికార్జున స్వామికి అన్నాభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు. ఈ సందర్భంగా విజయదుర్గా మాత ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు హరినాథశర్మ ఆధ్వర్యంలో సేవా సమితి సభ్యులకు దీక్షా వస్త్రాలను పంపిణీ చేశారు. కమిటీ సభ్యులు విఠల్, నర్సింహారెడ్డి, రవీందర్, సురేశ్, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

న్యాయ నిర్ణేతగా చంటి



గజ్వేల్ గ్రామీణ: జిల్లా కేంద్రంలో నేడు జరిగే యువజన ఉత్సవాల పోటీల్లో విజేతలను నిర్ణయించేందుకు గజ్వేల్ పట్టణానికి చెందిన ప్రముఖ డ్యాన్స్ మాస్టర్ చంటిని న్యాయ నిర్ణేతగా నియమించినట్లు జిల్లా యువజన శాఖ కోఆర్డినేటర్ వెంకటేశం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా చంటి మాట్లాడుతూ.. యువకులు పోటీల్లో పాల్గొని కళా నైపుణ్యాన్ని ప్రదర్శించాలని కోరారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టండి

గజ్వేల్, న్యూస్‌టుడే: పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టిసారించి ప్రజలకు ఇబ్బందులు ఏర్పడకుండా చూడాలని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ బల్దియా ఛైర్మన్ ఎన్సీ రాజమౌళి అధికారులకు సూచించారు. ఆయన అధ్యక్షతన సోమవారం కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ..కొన్ని వార్డుల్లో పనులు సరిగా చేయటం లేదని ప్రజలనుంచి ఫిర్యాదులు అందుతున్నాయని అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. పదోన్నతి పొందిన ఏఈ శ్రీధర్‌రెడ్డికి ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ జకీ, కమిషనర్ నర్సయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే భవిష్యత్తు

కార్ఖానా, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ తెలిపారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల జోనల్ స్థాయి పోటీలను సోమవారం బోయిన్‌పల్లి క్రీడా మైదానంలో బోర్డు సీఈవో మధుకర్‌నాయక్‌తో కలిసి ప్రారంభించారు. పోటీల్లో వికారాబాద్, మేడ్చల్, మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి, రంగారెడ్డి, హైదరాబాద్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల నుంచి సుమారు 699 మంది ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు పాల్గొంటున్నారని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కోటాజీ తెలిపారు.

మద్యం తాగి పట్టుబడిన వారికి జరిమానా

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: మద్యం తాగి పట్టుబడిన పలువురు వాహనదారులకు సోమవారం సిద్దిపేట జిల్లా ద్వితీయశ్రేణి జ్యుడిషియల్ న్యాయమూర్తి కాంతారావు జరిమానా విధించారు. గత కొన్ని రోజుల కిందట పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తన సిబ్బందితో తనిఖీలు నిర్వహించగా ఎనిమిది మంది మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించారు. నిర్ధారణ పరీక్షల అనంతరం నివేదిక ఆధారంగా వారిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి వారికి మొత్తంగా రూ.15,500 జరిమానా విధించారు.

ఉత్సవ నిర్వహణ కమిటీ ఎన్నిక

హుస్నాబాద్, న్యూస్‌టుడే: బహుజన బతుకమ్మ వేడుకలను హుస్నాబాద్‌లో అక్టోబరు 7న నిర్వహించనున్నట్లు బతుకమ్మ ఉత్సవ కమిటీ కన్వీనర్ మేకల వీరన్నయాదవ్ తెలిపారు. సోమవారం హుస్నాబాద్‌లో విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో తెలంగాణ ఐకాస, వివిధ పార్టీలు, ప్రజాప్రతినిధులతో సమావేశం జరిగింది. నిర్వహణ కమిటీని ఎన్నుకున్నారు. ముఖ్య సమన్వయకర్తగా పుర అధ్యక్షురాలు ఆకుల రజిత, సమన్వయకర్తలుగా కౌన్సిలర్లు, సలహాదారులుగా లక్ష్మారెడ్డి, లింగమూర్తి, శివయ్య, వెంకటన్న, రవీందర్, శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పుర కార్యాలయంలో 7న జరిగే ఉత్సవాలకు సంబంధించిన గోడ పత్రికలను పురాధ్యక్షురాలు రజిత, కమిటీ సభ్యులు అవిష్కరించారు.

కూలీల కొరతకు చెక్!

పల్లెల్లో పెరుగుతున్న డ్రోన్‌ల వినియోగం

న్యూస్‌టుడే, మిరుదొడ్డి

వ్యవసాయ రంగంలో డ్రోన్ల వినియోగంపై కేంద్రం తీసుకున్న నిర్ణయంతో విప్లవాత్మక మార్పులు రానున్నాయి. ఉద్యాన తోటల్లో సైతం వీటిని వినియోగించి పల్లె యువకులు అధిక ఆదాయం పొందుతున్నారు.

సమగ్ర సస్యరక్షణకు మందుల పిచికారీ.. ఇతర వ్యవసాయ పనులు చేయడం రైతులకు సవాలుగా మారింది. ముఖ్యంగా కూలీల కొరత అధికంగా ఉంది. పురుగు మందులు పిచికారీ చేసే సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకుంటే రైతుల ప్రాణాలకు ప్రమాదం వాటిల్లే అవకాశం ఉంది. దీని నుంచి ఉపశమనం కలిగించే విధంగా ఇటీవల డ్రోన్ల వినియోగంపై నిర్ణయం తీసుకుంటున్నారు. దీంతో స్థానిక యువకులు డ్రోన్లను అద్దెకు ఇస్తూ ఆదాయం పొందుతున్నారు.



మిరుదొడ్డిలో ద్రావణం పిచికారీ చేస్తున్న యంత్రం

ఎకరానికి పది నిమిషాలే..

మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండలాలలో డ్రోన్ల ద్వారా మొక్కజొన్న, పత్తి, వరి పంటలకు రసాయనక ఎరువుల పిచికారీ ఇప్పుడిప్పుడే విస్తరిస్తుంది. దీంతో సీజన్‌లో కూలీల కొరత, శ్రమ, సమయం ఆదా అవుతుంది. మిరుదొడ్డి మండలం అల్వాల, మిరుదొడ్డి, కొండాపూర్, లక్ష్మీనగర్, అక్బర్‌పేట భూంపల్లి మండలం ఖాజీపూర్, వీరారెడ్డిపల్లి, జంగపల్లి గ్రామాలకు చెందిన పది మంది యువకులు వీటి ద్వారా మందు పిచికారీ చేస్తూ ఉపాధి పొందుతున్నారు. చేతి పంపు ద్వారా ఎకరాకు మందు కొడితే సుమారు మూడు గంటల సమయం పడుతుంది. డ్రోన్ ద్వారా కేవలం 10 నిమిషాల సమయమే పడుతుంది. రూ. 500 ఖర్చవుతుంది తక్కువ సమయంలో సులభంగా పనులు అవుతుండడంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు.

రూ.వేయి ఖర్చు.. సమయం ఆదా..

–రాజు, రైతు, మిరుదొడ్డి

నేను రెండెకరాల్లో వరి సాగు చేస్తున్నా. కలుపు మొక్కల నివారణకు గతంలో రసాయనాలను పిచికారీ చేయడానికి ఆరు గంటల సమయంతో పాటు ఇద్దరు వ్యక్తులు అవసరం పడేది. ఇప్పుడు డ్రోన్ సాయంతో కలుపు నివారణకు రసాయనాల పిచికారీ కేవలం 20 నిమిషాల్లో పూర్తి చేశా. రూ.వేయి ఖర్చయింది.

ఏడాదిలోనే పెట్టుబడి వచ్చింది

–నగేష్, డ్రోన్ నిర్వాహకుడు, మిరుదొడ్డి

డ్రోన్‌ను ఈ సంవత్సరమే రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చా. ఒక ఎకరాకు రూ.500 వసూలు చేస్తున్నాం. ఇప్పటివరకు రూ.5 లక్షల మేర సంపాదించాం. ఏడాదిలోపే పెట్టుబడి వచ్చింది.

మేమున్నాం.. మీకు తోడుగా

సిద్దిపేట టౌన్ 9963585050	జగదేవపూర్ 8008573209	చేర్యాల 8008574871
హుస్నాబాద్ 8008573520	దుబ్బాక 9030037175	గజ్వేల్ 9490675047 (10AM TO 1 PM)

మిరుదొడ్డి, న్యూస్‌టుడే:

? మిరుదొడ్డిలోని ఒకటో వార్డులో వీధిలో కుక్కల సంచారం ఎక్కువగా ఉంది. వాహనదారులను, చిన్నారులను వెంబడిస్తున్నాయి. కుక్కలను ఊరి దూరంగా తరలించాలి. – రాజు, మిరుదొడ్డి

✔ సమస్య పరిష్కారానికి ఉన్నతాధికారులకు నివేదిస్తాం. కుక్కల సంచారంపై చర్యలు తీసుకుంటాం. – షహీం, కార్యదర్శి, మిరుదొడ్డి

? మిరుదొడ్డి శివాజీ కాలనీలో మురుగు కాలువలు సరిగా లేవు. వర్షాలకు ఇళ్ల మధ్య నీరు నిలిచింది. నీరు నిల్వ ఉండకుండా శాశ్వత చర్యలు చేపట్టాలి. – రాజేష్, మిరుదొడ్డి

✔ మురుగు కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. వర్షపు నీరు నిల్వకుండా చూస్తాం. – గణేష్ రెడ్డి, ఎంపీడీవో, మిరుదొడ్డి

శరన్నవరాత్రోత్సవాలకు ఆహ్వానం

కొండపాక గ్రామీణం: మర్పడ్గలోని శ్రీవిజయదుర్గామాత సంతాన సమేత మల్లికార్జునస్వామి క్షేత్రంలో ఈ నెల 3వ తేదీ నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం అవుతున్నాయి. ఉత్సవాలకు హాజరు కావాలని క్షేత్ర నిర్వాహకులు హరినాథ శర్మ సోమవారం సిద్దిపేటలో ఎమ్మెల్యే హరీశ్‌రావుకు ఆహ్వాన పత్రిక అందజేశారు. కమిటీ సభ్యులు హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ, తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ను కలిసి ఆహ్వానించారు.

3న ఏఎంసీ పాలకమండలి ప్రమాణ స్వీకారం

గజ్వేల్: గజ్వేల్ ఏఎంసీ సభ్యులు ఈ నెల 3న ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ మేరకు ఛైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ సర్దార్‌ఖాన్, అధికారులు సోమవారం మార్కెట్ యార్డులో స్థల పరిశీలన చేశారు.

రక్తదానం శిబిరం.. పండ్ల పంపిణీ

హుస్నాబాద్, కోహెడ, కోహెడ గ్రామీణం, న్యూస్‌టుడే: మాజీ శాసనసభ్యుడు వొడితల సతీశ్‌కుమార్ జన్మదిన వేడుకలను హుస్నాబాద్ భారాస కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. పురపాలిక అధ్యక్షురాలు ఆకుల రజిత, ఉపాధ్యక్షురాలు అనిత తదితరులు కేక్ కోసి పంపిణీ చేశారు. అనంతరం ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కోహెడ మండల భారాస అధ్యక్షుడు పెరుగు నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో అంబేడ్కర్ కూడలిలో కేకు కోశారు. అనంతరం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అక్కన్నపేట అంబేడ్కర్ చౌరస్తా వద్ద మాజీ ఎంపీపీ మాలోతు లక్ష్మి, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు భూక్యా మంగ కేక్ కోశారు. పుట్టినరోజు సందర్భంగా సతీష్‌కుమార్ దంపతులు శ్రీశైలం మల్లన్నస్వామిని దర్శించుకున్నారు.



హుస్నాబాద్‌లో కేక్ కోస్తున్న రజిత

నిబద్ధతతో పనిచేస్తే గుర్తింపు

దౌల్తాబాద్, న్యూస్‌టుడే: నిబద్ధతతో పనిచేసే ఉద్యోగులకు గుర్తింపు వస్తుందని ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య పేర్కొన్నారు. దౌల్తాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న రాజం పదవీ విరమణ కార్యక్రమం సోమవారం జరిగింది. అరుణోదయ కళాకారిణి విమలక్క ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

సామాజిక మాధ్యమాలకు బానిస కావొద్దు

గజ్వేల్ గ్రామీణ, దుబ్బాక, న్యూస్‌టుడే: విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని గజ్వేల్ సీఐ సైదా, దుబ్బాక ఎస్సై గంగరాజు పేర్కొన్నారు. సోమవారం ప్రజ్ఞాపూర్‌లోని ఉన్నత, పెద్దచీకోడ్ జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు మహిళ, పోలీస్ చట్టాలు, సైబర్ నేరాలు-నియంత్రణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలన్నారు. హెచ్‌ఎం అనురాధ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్‌ను కలిసిన నాయకులు

సిద్దిపేట టౌన్: రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ ప్రీతమ్‌ను సిద్దిపేట, దుబ్బాక నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు పూజల హరికృష్ణ, చెరకు శ్రీనివాస్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. దళితుల సంక్షేమానికి నిధులు మంజూరు చేయాలని కోరారు.

క్రీడాకారులకు అభినందన

దుబ్బాక: ఇటీవల మండలంలో జరిగిన ఎస్జీఎఫ్ క్రీడల్లో ప్రతిభ చూపిన హబ్సీపూర్ జ్యోతిబా పులే బీసీ గురుకుల క్రీడాకారులను ప్రిన్సిపల్ గోపాల్‌రెడ్డి సోమవారం అభినందించారు. పతకాలు సాధించడం గర్వకారణమన్నారు.

సభ్యత్వ నమోదుపై సమీక్ష

కోహెడ: కోహెడలో సోమవారం భాజపా సభ్యత్వ నమోదుపై సమీక్ష జరిగింది. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాంగోపాల్ రెడ్డి, నియోజకవర్గ సభ్యత్వ నమోదు బాధ్యులు తిరుమల హాజరయ్యారు. నియోజకవర్గంలోనే కోహెడ మొదటి స్థానంలో ఉండడం హర్షించదగ్గ విషయమన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశం, రజినీకాంత్ రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చౌటపల్లిలో గ్రామస్థుల ఆందోళన



తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట గ్రామస్థులు

అక్కన్నపేట(హుస్నాబాద్ గ్రామీణం): చౌటపల్లిలో తెలంగాణ తల్లి విగ్రహానికి గుర్తుతెలియని దుండగులు నిప్పంటించారు. గ్రామంలోని చౌరస్తాలో విగ్రహం ఏర్పాటు చేశారు. కొన్ని కారణాలతో ఆవిష్కరించలేదు. దీంతో విగ్రహానికి వస్త్రం కప్పారు. సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించారు. సోమవారం విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో సీఐ శ్రీనివాస్, ఎస్సై విజయభాస్కర్ అక్కడికి చేరుకుని విగ్రహాన్ని పరిశీలించారు. గ్రామస్థులతో మాట్లాడి వివరాలు తెల్సుకున్నారు. దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్, భారాస నాయకులు నిరసన తెలిపారు. భారాస నాయకులు విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు బీలు నాయక్, రమేశ్, త్రిమూర్తి, వెంకటరాజు, సాంబరాజు, రాజయ్య రంగారావు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ముందస్తు బతుకమ్మ వేడుకలు



వర్గల్ గురుకులంలో



దుబ్బాక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

హుస్నాబాద్, వర్గల్, న్యూస్‌టుడే: హుస్నాబాద్ ఓ ప్రైవేటు పాఠశాలలో సోమవారం ముందస్తు బతుకమ్మ వేడుకలు జరిగాయి. పురపాలిక అధ్యక్షురాలు ఆకుల రజిత, ఉపాధ్యక్షురాలు అనిత, విద్యార్థినులు, ఉపాధ్యాయినులు బతుకమ్మ ఆడారు. అనంతరం ఎల్లమ్మ చెరువులో నిమజ్జనం చేశారు. వర్గల్ మహాత్మా జ్యోతిబా పులే వెనుకబడిన తరగతుల డిగ్రీ గురుకుల విద్యాలయంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు బతకమ్మను పేర్చి ఆటపాటలతో సందడి చేశారు. ప్రిన్సిపల్ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాక: దుబ్బాక పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ కె. భవాని పండగ గొప్పతనాన్ని వివరించారు.

చికిత్స పొందుతూ కార్మికుడి మృతి



శ్రీనివాస్

చేర్యాల, న్యూస్‌టుడే: ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురైన కొమురవెల్లి మండల పరిధి ఐనాపూర్‌కు చెందిన హమాలీ కార్మికుడు అక్కెం శ్రీనివాస్(44) ఐదు రోజుల క్రితం ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ చనిపోయాడని ఎస్సై రాజు తెలిపారు. ఆయన భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

జూద స్థావరంపై దాడి

జగదేవపూర్, న్యూస్‌టుడే: చాట్లపల్లిలో ఓ వ్యవసాయ క్షేత్రంలో నిర్వహిసున్న జూద శిబిరంపై సోమవారం సాయంత్రం దాడి చేసినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. తొమ్మిది మంది అదుపులోకి తీసుకొని రూ. 14 వేల నగదు, 9 చరవాణులను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు చేశామన్నారు.

భూములు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: నారాయణరావుపేటలో ప్రభుత్వ భూములు భూములను అక్రమించిన వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని అఖిల పక్ష పార్టీల నేతలు డిమాండు చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ లక్ష్మారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. పదేళ్లుగా ఆక్రమణపై పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. నాయకులు రమేశ్‌గౌడ్, బాబు, ఎల్లయ్య, కరుణాకర్, శ్రీనివాస్, రాజిరెడ్డి పాల్గొన్నారు.

విద్యాభ్యున్నతికి దాతల సహకారం అవసరం

గజ్వేల్ గ్రామీణ, న్యూస్‌టుడే: గ్రామీణ నిరుపేద విద్యార్థుల అభ్యున్నతికి దాతల సహకారం ఎంతో అవసరమని డీసీసీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి అన్నారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని కేసారం ప్రభుత్వ పాఠశాలకు దాత కప్పు భాస్కర్ సహకారంతో 50 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్, దుస్తులు, క్రీడా సామగ్రి అందజేశారు. ఏఎంసీ ఛైర్మన్ నరేందర్ రెడ్డి, వైస్ ఛైర్మన్ సర్దార్ ఖాన్, కౌన్సిలర్ గోపాల్ రెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.

పాపన్నగౌడ్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

కొండపాక గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధి దుద్దెడలో సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహం ఏర్పాటుకు సోమవారం గ్రామ గౌడ సంఘం సభ్యులు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడారు. భవిష్యత్తు తరాలకు పాపన్నగౌడ్ ధైర్యసాహసాలు తెలిపేలా విగ్రహాన్ని గ్రామంలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మాజీ సర్పంచులు ఆరేపల్లి మహాదేవ్‌గౌడ్, పెద్దంకుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులున్నారు.

ఆదర్శలో ఆత్మీయ సన్మాన సభ

బెజ్జంకి, న్యూస్‌టుడే: ఎల్లంపల్లిలోని ఆదర్శ పాఠశాలలో సుమారు 11 సంవత్సరాలుగా పని చేసి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సోమవారం పాఠశాలలో ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్‌గా పని చేసి బదిలీపై వెళ్లిన హర్జీత్‌కౌర్, ఇతర ఉపాధ్యాయులను విద్యార్థులు, ప్రస్తుత ఉపాధ్యాయులు శాలువలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ప్రిన్సిపల్ ఖలిదా శిరీన్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెంచర్ పనులు నిలిపివేయాలని వినతి

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: వ్యవసాయ భూమిలో ప్రభుత్వ అనుమతి లేకుండా వెంచర్ ఏర్పాటు పనులను అధికారులు నిలుపుదల చేయాలని నారాయణరావుపేట మండలం జక్కాపూర్ గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ మేరకు పలువురు గ్రామస్థులు కలెక్టరేట్‌లో జిల్లా పంచాయతీ కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందజేశారు.

క్షేత్రసహాయకుడిపై దాడి తగదు

రాయపూర్: వడ్డేపల్లి క్షేత్రసహాయకుడు బండ్ల స్వామిపై దాడి చేయడం తగదని, నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు పి.శంకర్ సోమవారం రాయపోల్‌లో ఒక ప్రకటనలో తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత పాటించండి

మిరుదొడ్డి: పరిసరాల పరిశుభ్రత పాటిస్తే ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీవో గణేష్ రెడ్డి పేర్కొన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో సోమవారం లక్ష్మీనగర్‌లో భాగంగా తడి, పొడి చెత్తపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు.

వీధి కుక్కల స్వైరవిహారం: మహిళకు గాయాలు

మిరుదొడ్డి, న్యూస్‌టుడే: మిరుదొడ్డి మండలం మల్లుపల్లిలో సోమవారం రెండు వీధి కుక్కలు ఎల్లవ్వ అనే మహిళపై దాడి చేయగా ఆమె చేతికి తీవ్ర గాయాలయ్యాయని గ్రామస్థులు తెలిపారు. స్థానికులు వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం మిరుదొడ్డికి అక్కడ్నుంచి సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

740 మంది రైతులకు రుణవిముక్తి



మాట్లాడుతున్న పీఏసీఎస్ ఛైర్మన్ కృష్ణ, వేదికపై డైరెక్టర్లు

చేర్యాల, న్యూస్‌టుడే: ప్రభుత్వం తీసుకున్న రుణమాఫీ నిర్ణయంతో చేర్యాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో 740 మంది రైతులకు రూ.2 లక్షల్లోపు రుణవిముక్తి కలిగిందని పీఏసీఎస్ ఛైర్మన్ కృష్ణ, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు మేనేజరు సంపత్‌కుమార్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో సోమవారం సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో రుణాలిచ్చి రైతులను ఆదుకుంటామన్నారు. రుణాలు తీసుకోవడం, సకాలంలో వాటిని తీర్చడం ద్వారా సంఘం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. సమావేశంలో బ్యాంకు పర్యవేక్షకుడు మహేశ్, సంఘం డైరెక్టర్లు శ్రీనివాస్, కొమ్ము రవి, నర్సింహులు, జ్యోతి, కమలాకర్, మాధవరెడ్డి, నర్సింహులు, బాలనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

న్యాయ విచారణ కోరుతూ ఆందోళన



నిరసన తెలుపుతున్న వీహెచ్‌పీ ప్రతినిధులు

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ వ్యవహారంపై సుప్రీంకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తితో విచారణ జరిపించాలని విశ్వ హిందూ పరిషత్ ప్రాంత కార్యవర్గ సభ్యుడు చింతల వెంకన్న డిమాండు చేశారు. ఈ మేరకు సోమవారం సిద్దిపేటలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... దేవాదాయ శాఖను ప్రభుత్వం రద్దు చేయాలని, అన్యమతస్థులను దేవాదాయ శాఖ నుంచి తొలగించాలని, దేవాలయ ప్రాంగణంలో ఉన్న వ్యాపార సముదాయాలను హిందూవులకు మాత్రమే అప్పగించాలని డిమాండు చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, గీతారెడ్డి, రాజారాం, వీరేశం, శ్రీనివాస్, మురళి, అనిల్, లక్ష్మణ్, రాజేశం, మోహన్‌రెడ్డి, సురేశ్‌రెడ్డి, ఉమా తదితరులు ఉన్నారు.

అక్కన్నపేటలో చోరీ

అక్కన్నపేట(హుస్నాబాద్ గ్రామీణం): అక్కన్నపేటలోని తంగళ్లపల్లి పర్శయ్య ఇంట్లో సోమవారం దొంగతనం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... పర్శయ్య లాండ్రీ దుకాణం నిర్వహిస్తారు. ఇటీవల భూమి విక్రయించగా రూ.1.50 లక్షలు రావడంతో వాటిని ఇంట్లోని బీరువాలో దాచి ఉంచారు. సోమవారం సాయంత్రం ఆయన భార్య రాధ ఇంటికి గొళ్లెం పెట్టి బయటకు వెళ్లి తిరిగి వచ్చే సరికి తలుపులు తీసి ఉన్నాయి. అనుమానం వచ్చి బీరువా తెరిచి చూడగా దాచి ఉంచిన నగదు లేదు. వాటితో పాటు పక్కనే ఉన్న మరో రూ.2 వేలు లేవు. దీంతో దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై విజయభాస్కర్‌ను సంప్రదించగా వచ్చిన సమాచారంతో వెళ్లి ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ జరుపుతున్నామన్నారు. ఫిర్యాదు చేయలేదన్నారు.

న్యాయవాదుల నిరసన దీక్ష



కోర్టు ఆవరణలో నినాదాలు చేస్తూ..

దుబ్బాక: తెలంగాణ ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్ పిలుపు మేరకు సోమవారం దుబ్బాక కోర్టు ఆవరణలో న్యాయవాదులు నిరసన తెలిపి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బాపురావు మాట్లాడుతూ.. న్యాయవాదులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు న్యాయవాదుల ప్రొటెక్షన్ యాక్ట్‌ను అమలు పరచాలని, 41ఏ సీఆర్‌పీసీని వెంటనే రద్దు చేయాలన్నారు. ఏజీపీ నాగరాజు, న్యాయవాదులు అశోక్, భాస్కర్‌రెడ్డి, రామకృష్ణ ప్రభు, జ్ఞానేశ్వర్, చంద్రయ్య, శ్రీనివాస్, సంతోశ్ తదితరులు పాల్గొన్నారు.

చట్టం దృష్టిలో అందరూ సమానమే..

జగదేవపూర్, న్యూస్‌టుడే: చట్టం దృష్టిలో మానవులంతా సమానమేనని డిప్యూటీ తహసీల్దార్ రఘువీరారెడ్డి అన్నారు. ఇటిక్యాలలో సోమవారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి, ఆర్ఐ షాహిద్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే పోలీస్ శాఖ ధ్యేయం

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: శాంతిభద్రతల రక్షణ కోసం పోలీసు శాఖ ఎల్లప్పుడు కృషి చేస్తుందని ఏసీపీ మధు అన్నారు. పట్టణం, గ్రామాలు, కాలనీల్లో కొత్త వారు, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలన్నారు. పట్టణంలోని కేసీఆర్‌నగర్ (రెండు పడక గదుల ఇళ్ల సముదాయం)లో సోమవారం కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలాంటి ధ్రువపత్రాలు లేని 18 ద్విచక్రవాహనాలు, ఒక కారు, మూడు ఆటోలను సీజ్ చేశారు. కాలనీల్లో సీసీ కెమెరాలు బిగించుకోవాలని సూచించారు. తనిఖీల్లో సీఐలు ఉపేందర్, విద్యాసాగర్, దుర్గ తదితరులు పాల్గొన్నారు.



కేసీఆర్ నగర్‌లో సూచనలిస్తున్న ఏసీపీ మధు, సీఐ ఉపేందర్